# తప్పు చేసి పప్పు కూడు

ఆరోజు పోస్టులో పార్వతి పేరుతో ఒక కవరు వచ్చింది. ఆ కవరును పార్వతే స్వయంగా అందుకుని ఓపెన్ చేసి అందులో వున్న కాయితాన్ని బయటకు లాగి చదివింది.

ప్రముఖ సీనియర్ రచయిత్రి డి.పార్వతీదేవి గారికి-

నమస్కారం. మేము కొత్తగా 'దర్పణం' అనే మాసపత్రికను ప్రారంభించబోతున్నాము. ఇంకో నెల రోజుల్లో విడుదల అవుతుంది. మా పత్రిక ప్రారంభ సంచిక కోసం మీ నించి ఒక కథను ఆశిస్తున్నాం. మీరు పంపబోయే కథకు పారితోషికంగా వెయ్యి రూపాయలకు డిమాండు డ్రాఫ్ట్‌ను పంపుతున్నాం. దాన్ని స్వీకరించి మాకు సహకరించవలసిందిగా కోరుతున్నాం.

కింద ఎడిటర్ పేరుతో ఎవరిదో సంతకం వుంది. ఒక పక్కగా ఆ పత్రికా కార్యాలయం ఎడ్రసు రబ్బరు స్టాంపు కొట్టి వుంది.

ఆ ఉత్తరాన్ని చదివి పార్వతి ఆశ్చర్యపడింది. ఎందుకంటే ఒక రచయిత్రిగా తను అంత స్థాయికి ఎదగలేదు. ఇంకా ప్రాథమిక దశలోనే వుంది.

పార్వతి పూర్తి పేరు పార్వతీదేవి. ఇంటి పేరుకు ముందు డి.వస్తుంది.

అప్పుడు గుర్తుకు వచ్చింది పార్వతికి ఆరు నెలల క్రితం తమకి మద్రాసు ట్రాన్స్‌ఫరయి వచ్చిన తర్వాత తాము ప్రస్తుతం వుంటున్న ఆ ఇల్లును కొన్నారు. అంతకుముందు ఆ ఇంట్లో డి.పార్వతీదేవి అనే ఒక ప్రముఖ రచయిత్రి వుండేది. ఆమె కొడుక్కి వేరే ఏదో వూరికి బదిలీ అయిన కారణంగా ఆమె తన పేరున వున్న ఆ ఇంటిని అమ్మేసింది. వాళ్లు వెళ్లిపోయారు. అలా వెళ్లిన కొన్ని రోజులకే ఆమె చనిపోయిందని ఎవరో చెప్పారు.

కానీ ఆయన చనిపోయిన విషయం తెలియని ఆ కొత్త పత్రికా సంపాదకుడు పార్వతీదేవికి రాసిన కవరును ఎడ్రసు ప్రకారం, పోస్ట్‌మెన్ తనకు ఇచ్చి వెళ్లాడని అనుకుంది పార్వతి.

మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చిన భర్త రామ్మూర్తికి ఆ కవరును చూపించి విషయాన్ని చెప్పింది పార్వతి.

"ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో" అన్నాడతను.

"ఎలా?" అన్నది పార్వతి.

"ఎలాగంటే-నీకు కథలు రాసి గొప్ప రచయిత్రివని పేరు తెచ్చుకోవాలనే కోరిక వుంది. కానీ అనుభవం లేనందువల్ల ఒక్కటీ అచ్చు కాలేదు. అన్నీ తిరిగి వచ్చి నిన్ను నిరుత్సాహపరుస్తున్నాయి. ఇప్పుడు ఈ కొత్త పత్రిక వాళ్లు వాళ్లంతట వాళ్లే కథ

పంపమంటూ ఉత్తరం రాశారు కాబట్టి నీ కథను తప్పకుండా ప్రచురిస్తారు. అంటే అసలు పార్వతీదేవి చనిపోయిన విషయం తెలీదు కాబట్టి-నువ్వు ఏదో పత్రికలో అచ్చయిన కథను పాత్రలపేర్లు, కథ పేరు మార్చి కాపీ కొట్టి రాసి 'దర్పణం' పత్రికకు పంపించు. మీ ఇద్దరి పేర్లూ ఒకటే కాబట్టి వాళ్లు ఆ పార్వతీదేవే కథ రాసిందని అనుకుంటారు. ఇటు నీ కోరిక తీరుతుంది. అటు ఆ వెయ్యి రూపాయలూ మన స్వంతం అవుతాయి. ఇలా చెయ్యి'' అన్నాడు రామ్మూర్తి భార్యను సంతోషపరిచే అవకాశాన్ని సద్వినియోగపరుచుకుంటూ-

"ఇలా చేస్తే సమస్యలు రావా?" అని అనుమానంగా అడిగింది పార్వతి.

"రావు. అసలు పార్వతీదేవి ఎప్పుడు చనిపోయిందో ఎవరికీ తెలీదు. కథను పంపిన తర్వాత ఆమె చనిపోయిందని తెలిసినప్పుడు ఇక ఆ విషయాన్ని వదిలేస్తారు" అన్నాడు రామ్మూర్తి తేలికగా.

వాళ్లలా మాట్లాడుకుంటున్నప్పుడు కొరియర్ సర్వీసు మనిషి ఒకతను వచ్చి పార్వతీచేత సంతకం చేయించుకుని ఒక ప్యాకెట్టుని ఇచ్చి వెళ్లాడు. దాన్ని విప్పి చూసినప్పుడు ఐదారు రకాల పత్రికలు వున్నాయి.

పార్వతి తమ్ముడు విజయవాడలో వుంటున్నాడు. ప్రతి వారం రకరకాల పత్రికలు కొని అక్కడకు కొరియర్ సర్వీసులో పంపిస్తూ వుంటాడు.

ఒక వారపత్రిక కవర్ పేజీ మీద కథలపోటీ వివరాలు అని రాసి వుంది.

గబగబా పేజీలు తిప్పింది పార్వతి. మొదటి బహుమతి పొందిన కథను తీసి, "మీరు చెప్పినట్టు ఈ కథను కాపీ కొట్టి 'దర్పణం' పత్రికకు పంపుతాను. తప్పకుండా వాళ్లకు నచ్చుతుంది" అన్నది పార్వతి సంతోషంగా.

రామ్మూర్తి సరేనని తలవూపి పార్వతి చేత డిమాండు డ్రాఫ్టు మీద సంతకం చేయించుకుని వెళ్లాడు.

వెళ్లబోయే ముందు పార్వతితో ఇలా చెప్పాడు.

"సాయంత్రం వంట చెయ్యకు. నేను వచ్చేసరికి సిద్ధంగా వుండు. ఫస్టు షో సినిమాకు వెళదాం. తిరిగి వస్తూ ఏదైనా రెస్టారెంటులో భోజనం చేసి ఇల్లు చేరదాం.. ఆఫీసు నించి వచ్చేటప్పుడు నీకు ఇష్టమయిన స్వీట్లను తీసుకువస్తాను. ఖర్చులన్నీ 'దర్పణం' మాసపత్రిక వాళ్లవే.

రామ్మూర్తి వెళ్లిన తర్వాత కాగితాలు తీసుకుని వారపత్రికలో మొదటి బహుమతి పొందిన కథను జాగ్రత్తగా పాత్రల పేర్లను, కథ పేరును మార్చి కాపీ కొట్టి ఆ కథ మీద తన పేరు రాసింది.

చెప్పినట్టుగానే రామ్మూర్తి కొన్నిరకాల స్వీట్లని తీసుకువచ్చాడు. ఇద్దరూ స్వీట్లు తిన్నాక

పార్వతి కాఫీ కలిపి ఇచ్చింది రామ్మూర్తికి.

కవర్లూ, పోస్టు స్టాంపులూ ఇంట్లో వున్నాయి కాబట్టి అప్పటికప్పుడు ఆ కథను కవర్లో వుంచి ఎడ్రసు రాసి, స్టాంపులు అంటించి కవర్ని అంటించారు. సినిమాకు వెళుతూ మధ్యలో ఆగి దాన్ని పోస్టు డబ్బాలో పడేశారు.

"ఇలా బాగానే వుంది. ఎలాగూ పార్వతీదేవి చనిపోయింది కాబట్టి కాపీ కొట్టి రాసిన కథలను నా పేరుతో మిగిలిన పత్రికలకు కూడా పంపుతాను" అన్నది భర్తతో థియేటర్‌లో.

"కానీ నువ్వు ఒక విషయంలో జాగ్రత్త వహించాలి" అన్నాడతను.

"ఏమిటో చెప్పండి" అనడిగింది పార్వతి.

"యే పత్రికలో కాపీ కొట్టిన కథను అదే పత్రికకు పంపించకు, తెలిసిపోతుంది. వేరే పత్రికకు పంపించు" అని సలహా ఇచ్చాడు.

పార్వతి నవ్వి తల ఊపింది.

కొన్ని రోజులు గడిచాయి. ఒకరోజు 'దర్పణం' మాసపత్రిక కాపీ పోస్టులో పార్వతికి వచ్చింది. పత్రికను బయటకు తీసి అచ్చులో తన పేరును చూసి బాగా సంతోష పడింది.

ఇంటికి వచ్చిన తర్వాత ఆ కథను చూసి అప్పటికప్పుడు కథల పత్రికలు చదివే అలవాటు వున్న కొంతమంది బంధుమిత్రులకు తన భార్య పార్వతి రాసిన ఫలానా కథ 'దర్పణం' మాసపత్రికలో అచ్చయిందనీ, చదవమనీ రామ్మూర్తి ఫోన్ చేసి చెప్పాడు.

ఆపైన పదిరోజులకు 'దర్పణం' మాసపత్రిక సంపాదకుడి దగ్గర్నుంచి పార్వతికి ఒక ఉత్తరం వచ్చింది.

అందులో–పార్వతి పంపిన కథ ఒక ప్రముఖ వారపత్రిక కథల పోటీల్లో మొదటి బహుమతి పొందిన 'కలం మానదు' అనే కథకు కాపీ అనీ, కేవలం పాత్రల పేర్లూ, కథ పేరూ మార్చబడినాయనీ, అసలు కథను చదివి నిజం తెలుసుకున్నాననీ, ఒక ప్రముఖ సీనియర్ రచయిత్రి ఒక కాపీ కథను పంపించడం దారుణమనీ, ఇందుకు రచయిత్రి సంజాయిషీని కోరుతున్నాననీ రాశాడు.

పార్వతి కంగారు పడింది.

కానీ ఆమె భర్త రామ్మూర్తి ఆ ఉత్తరాన్ని చదివి, "కంగారు పడకు. ఇదేమంత గొప్ప విషయం కాదు" అన్నాడు.

అలా అని అప్పటికప్పుడే ఒక పోస్టు కార్డు తీసుకుని దానిమీద ప్రముఖ సీనియర్ రచయిత్రి డి.పార్వతీదేవిగారు ఇటీవల మరణించారు–అని రాసి, 'దర్పణం' మాసపత్రిక కార్యాలయం అడ్రసు రాసి పోస్టు చేశాడు రామ్మూర్తి.

(రచన ఇంటింటి పత్రిక – ఫిబ్రవరి 2010)